క్లుప్తంగా

పీసా చట్టంపై శిక్షణా తరగతులు



శిక్షణా తరగతులు నిర్వహిస్తున్న అధికారులు

పోలవరం రూరల్: పీసా(పంచాయతీరాజ్ ఎక్స్‌టెన్షన్ షెడ్యూల్ ఏరియా) చట్టంపై శిక్షణా తరగతులను పోలవరం మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. ఎంపీపీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, నూతనంగా ఎన్నికకాబడిన పీసా అధ్యక్షుడు, కార్యదర్శులకు రాష్ట్ర రీసోర్స్ పర్సన్ పల్లా త్రినాథరావు, డీపీఆర్‌సీ సిబ్బంది ప్రసంగిరాజు, పరిశీలకులుగా ఆర్ఎస్ పద్మజలు పాల్గొని వీరికి శిక్షణా కార్యక్రమం నిర్వహించినట్లు ఎంపీడీవో కె.శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మండల పరిషత్ సమావేశం నిర్వహణ

బుట్టాయగూడెం: మండల పరిషత్ సమావేశం గురువారం ఎంపీపీ కారం శాంతి అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో గృహ నిర్మాణం, ఆర్‌డబ్ల్యూఎస్, శిశు సంక్షేమ, వ్యవసాయశాఖ తదితర శాఖలకు చెందిన అధికారులతో మండలంలో చేపట్టబోయే పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కుంజా జ్యోతి మాట్లాడుతూ ఈ వేసవిలో గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మొడియం రామతులసి, వైస్ ఎంపీపీలు కుక్కల వరలక్ష్మి, గగ్గులోతు మోహన్‌రావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ శాఖలకు చెందిన అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నూతన ఆవిష్కరణలతో విజ్ఞానాభివృద్ధి

జంగారెడ్డిగూడెం: సీఎస్‌టీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విజ్ఞాన శాస్త్రంలో నూతన ఆవిష్కరణలు అనే అంశంపై అతిథి ఉపన్యాస కార్యక్రమం గురువారం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.ప్రసాద్‌బాబు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో పాలకొల్లు దాసరి నారాయణరావు ప్రభుత్వ డిగ్రీ మహిళా కళాశాల రసాయనశాస్త్ర విభాగ ఉపన్యాసకులు డాక్టర్ జి.విజయ స్వరూప్ సింగ్ పాల్గొని మాట్లాడారు. విజ్ఞాన శాస్త్రంలో నూతన ఆవిష్కరణలపై వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు తప్పనిసరిగా శాస్త్ర సాంకేతిక రంగాల్లో వస్తున్న మార్పులను గమనించాలని, విజ్ఞాన అభివృద్ధికి సంబంధించిన నూతన సవాళ్లను తెలుసుకోవాలంటే కొత్త పరిశోధనలు చేయాలన్నారు. కార్యక్రమంలో కళాశాల రసాయన శాస్త్ర విభాగ అధిపతి యు.వెంకటాచార్యులు, ఐక్యూఏసీ కో–ఆర్డినేటర్ రసాయన శాస్త్ర అధ్యాపకుడు డాక్టర్ ఎం.మధు, భౌతికశాస్త్ర విభాగం అధిపతి టీవీ రాంబాబు, కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ముగిసిన పెద్దింట్లమ్మ సంబరాలు

లింగపాలెం: కలరాయునగూడెం శివారు యర్రావారిగూడెం గట్టు మీద వేంచేసిన శ్రీ పెద్దింట్లమ్మ అమ్మ వారి సంబరాలు గురువారంతో అత్యంత వైభవంగా ముగిశాయి. ఈమేరకు అమ్మవారిని ఎడ్లబండ్లు, ట్రాక్టర్లపై మేళ తాళాలతో ట్రీన్‌మార్ డప్పులతో ధర్మాజీగూడెం, కాటమరెడ్డిపల్లి, యర్రావారిగూడెం, మఠంగూడెం గ్రామాల్లో రెండు రోజుల పాటు అమ్మవారి ఉత్సవాలు కొనసాగాయి. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి భక్తురాలు పామర్తి కనకదుర్గమ్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు.

చెత్త నుంచి సంపద సృష్టించాలి

లింగపాలెం: ప్రతి గ్రామ పంచాయతీలో ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్ ద్వారా వర్మికంపోస్ట్ ఎరువులు తయారు చేసి, చెత్త నుంచి సంపద సృష్టించాలని నూజివీడు డీఎల్‌పీవో సుందరి కార్యదర్శులను ఆదేశించారు. గురువారం మండలంలోని ధర్మాజీగూడెం, మఠంగూడెం, లింగపాలెం గ్రామాల్లో ఆమె పర్యటించి ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా సుందరి మాట్లాడుతూ ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్‌లో వానపాములు విడుదల చేసిన 45 రోజులకు వర్మికంపోస్టు ఎరువు తయారవుతుందన్నారు. డీఎల్‌పీవో వెంట పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ ల్యాబ్ టెక్నీషియన్ దినోత్సవం

జంగారెడ్డిగూడెం: మెట్ట ఏరియాలో ల్యాబ్ టెక్నీషియన్ల యూనియన్ ఏర్పాటు చేసి పలు సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయని జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బేబీకమల, ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ వజ్రకిరణ్ అన్నారు. ప్రపంచ ల్యాబ్ టెక్నీషియన్ దినోత్సవం సందర్భంగా మెట్ట ప్రాంతంలో క్లినికల్ లేబరేటరీ ఎక్స్‌రే టెక్నీషియన్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జంగారెడ్డిగూడెంలో ఏర్పాటు చేసిన ఉచిత రక్త పరీక్షల శిబిరాన్ని వైద్యులు డాక్టర్ బేబీకమల, డాక్టర్ వజ్ర కిరణ్ ప్రారంభించారు. సుమారు 150 మందికి ఉచితంగా రక్త పరీక్షలు నిర్వహించి రిపోర్టులు అందజేశారు. షేక్ దాదా సాహెబ్, నరేంద్ర, కిషోర్, చక్రి పాల్గొన్నారు.

సమ్మర్ యాక్షన్ ప్లాన్ సిద్ధం

- పట్టణ ప్రజల దాహార్తి నివారణకు చర్యలు
- తాగునీటి ట్యాంకర్లు, చలివేంద్రాల ఏర్పాటు
- యుద్ధ ప్రాతిపదికన పైప్‌లైన్ల నిర్మాణం
- కౌన్సిల్ సభ్యులు, అధికారుల అప్రమత్తం

జంగారెడ్డిగూడెం: పట్టణంలో వేసవిలో మంచినీటి సమస్య తలెత్తకుండా మున్సిపల్ పాలకవర్గం, అధికారులు సమ్మర్‌యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశారు. యుద్ధ ప్రాతిపదికన వారం పది రోజుల్లోనే కొత్తగా బోర్లు, పైప్‌లైన్లు ఏర్పాటు చేయనున్నారు. ఇందుకోసం అన్ని చర్యలు చేపట్టారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో వేసవి సమయంలో మంచినీటి సమస్యలు తలెత్తున్నాయి. దీంతో ప్రజలు నీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. ఈ ఇబ్బందులను తొలగించేందుకు పాలకవర్గం 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.కోటితో పట్టణంలో మంచినీటి సమస్య తీర్చేందుకు చర్యలు చేపట్టింది. కొత్తగా ఐదు బోర్ల నిర్మాణం, ఆయా ప్రాంతాల్లో మంచినీటి పైప్‌లైన్లు, పట్టణానికి వచ్చే వారి దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాలు ఏర్పాటు చేయనుంది.

నూతన బోర్లు

పట్టణంలో మంచినీటి అవసరాలు తీర్చేలా వేర్వేరు ప్రాంతాల్లో నూతనంగా ఐదు బోర్లు నిర్మించనున్నారు.



జంగారెడ్డిగూడెం పట్టణ వ్యూ

ఇందుకోసం రూ.39,59,265 వెచ్చించనున్నారు. పట్టణంలోని పరిమి టవర్స్ సమీపంలో ఒకటి, అశోక్ నగర్ సుబ్రహ్మణ్యం గుడి వద్ద ఒక బోరు, డాంగే నగర్‌లో ఒక బోరు, హైస్కూల్ వద్ద ఒక బోరు, టీచర్స్ కాలనీలో ఒక బోరు నిర్మాణాలు చేపట్టనున్నారు.

పైప్‌లైన్ల ఏర్పాటు

మంచినీటి ఎద్దడి నివారించే కార్యక్రమంలో పైప్ లైన్లు ఏర్పాటు చేసేందుకు కౌన్సిల్ సభ్యులు, అధికారులు చర్యలు చేపట్టారు. జగ్జీవన్ నగర్‌లో రెండు ప్రాంతాల్లో, అట్లల ఫ్యాక్టరీ ప్రాంతంలో, సాయిబాలాజీ టౌన్‌షిప్‌లో, 19వ వార్డులో, 26వ వార్డు నేతాజీ వీధిలో, రోటరీ క్లబ్ ప్రాంతంలో, 11వ వార్డు శివాలయం ప్రాంతంలో, 17వ వార్డు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి గుడి వద్ద పైప్‌లైన్లు ఏర్పాటు చేయనున్నారు. దీని కోసం రూ.52,55,371 వెచ్చించనున్నారు. ఈ పనులను యుద్ధ ప్రాతిప్రదికన వారం పది రోజుల్లో పూర్తి చేయనున్నారు.

రూ.కోటితో యాక్షన్ ప్లాన్



15వ ఆర్థిక సంఘం నిధులు రూ.కోటితో పట్టణంలో సమ్మర్ యాక్షన్ ప్లాన్ అమలు చేస్తున్నాం. బోర్లు, పైప్‌లైన్లు నిర్మించడం ద్వారా పట్టణంలోని అన్ని ప్రాంతాలకు మంచినీరు అందేలా చర్యలు తీసుకున్నాం. పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయి. వారం పది రోజుల్లో పనులను పూర్తి చేసి ప్రజలకు మంచినీటి సమస్య లేకుండా చూస్తాం.

–బత్తిన లక్ష్మి, మున్సిపల్ చైర్‌పర్సన్, జంగారెడ్డిగూడెం

అందుబాటులో మంచినీటి ట్యాంకర్లు



వేసవిలో మంచినీటి ఎద్దడి దృష్ట్యా ఇప్పటికే పట్టణంలో సమ్మర్ యాక్షన్ ప్లాన్ అమలు చేస్తున్నాం. అయినప్పటికీ అత్యవసర పరిస్థితులు తలెత్తితే ప్రజలకు నీటి సమస్యలు రాకుండా నాలుగు మంచినీటి ట్యాంకర్లను, రెండు ట్రాక్టర్లను సిద్ధంగా ఉంచాం. వేసవిలో పట్టణానికి వచ్చే వారు మంచి నీటి కోసం ఇబ్బందులు పడకుండా ప్రధాన కూడళ్లలో చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నాం.

– కేవీ రమణ, కమిషనర్, జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీ

గ్రామసభ ఏర్పాటు



కట్కూరులో గ్రామసభ నిర్వహిస్తున్న అధికారులు

వేలేరుపాడు: మండలంలోని 41.15వ కాంటూరు పరిధిలోని గ్రామాలకు సంబంధించి కట్కూరులో గురువారం పోలవరం ప్రాజెక్టు భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వి.శ్రీనివాసులరెడ్డి గ్రామసభ నిర్వహించారు. అవార్డు ఎంక్వైరీ నిర్వహణ కొత్తూరు, తూర్పుమెట్ట, బోళ్లపల్లి, యడవల్లి, చిట్టిం రెడ్డి పాలెం, ఎర్రమెట్ట గ్రామాలకు నిర్వహించిన సభలో నిర్మాణాలకు సంబంధించి పేర్లను చదివి వినిపించారు. కాగా, కుటుంబ పెద్ద మరణిస్తే నిర్మాణాల విలువలను వారి వారసుల ఖాతాల్లో జమ చేస్తామని శ్రీనివాసులరెడ్డి తెలిపారు.

సూపర్ సిక్స్.. అంతా తుస్

బుట్టాయగూడెం: కూటమి ప్రభుత్వం ఏర్పడి 10 నెలలు కావొస్తున్నా ఎన్నికల్లో వారు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, వైఎస్సార్‌సీపీ పోలవరం నియోజకవర్గ సమన్వయకర్త తెల్లం రాజ్యలక్ష్మి అన్నారు. మండలంలోని దుద్దుకూరులో గురువారం సర్పంచ్‌లు, జెడ్పీటీసీలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికారంలోకి రాకముందు ప్రజలను మభ్య పెట్టి ఎన్నో రకాల హామీలు ఇచ్చిన చంద్రబాబు అధికారంలోకి రాగానే ఆ హామీలను విస్మరించారని ధ్వజమెత్తారు. ఇటీవల అసెంబ్లీలో ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో నిరుద్యోగ భృతి ఊసే లేకపోవడం బాధాకరమన్నారు. తల్లికి వందనం హామీకి రూ.12,600 కోట్లు అవసరం ఉండగా బడ్జెట్‌లో కేవలం రూ.5387 కోట్లు మాత్రమే కేటాయించడం దారుణమన్నారు. అన్నదాత సుఖీభవ, ఉచిత బస్ ప్రయాణం, ఉచిత గ్యాస్ వంటి పథకాలను తుస్సుమనిపించారని విమర్శించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మొడియం రామతులసి, వైస్ ఎంపీపీ కుక్కల వరలక్ష్మి, సర్పంచ్‌లు తెల్లం రాముడు, కుంజా వెంకటేశ్వరరావు, తెల్లం వెంకాయమ్మ, మడకం రామలక్ష్మి, కుంజా దుర్గమ్మ, ఉయికే బొజ్జి, పాడియం లక్ష్మి, తాతి సీత, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నేతలు

మాజీ ఎమ్మెల్యే పరామర్శ



చంద్రకాంత చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే బాలరాజు

కొయ్యలగూడెం: గవరవరం ఎంపీటీసీ బిరుదుగట్ల రత్నకుమారిని మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు గురువారం పరామర్శించారు. రత్నకుమారి అత్తయ్య చంద్రకాంత ఇటీవల మృతి చెందడంతో బాలరాజు రత్నకుమారి నివాసానికి వెళ్లి ఆమె కుటుంబాన్ని ఓదార్చారు. చంద్రకాంత చిత్ర పటానికి నివాళులర్పించారు.

పంట ధ్వంసంపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: పంటను ధ్వంసం చేసిన ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై షేక్ జబీర్ తెలిపారు. తిరుమలాపురం గ్రామానికి చెందిన కొమ్మురెడ్డి విజయ్‌కుమార్‌కు గ్రామంలో ఎకరం సెంట్ల వ్యవసాయ క్షేత్రం ఉంది. ఈ భూమిలో మొక్కజొన్న పంటను పండిస్తున్నారు. అయితే ఈ పొలానికి సంబంధించి గత కొంత కాలంగా పెద్దల్లో గొడవ జరుగుతోంది. అయితే ఈ నెల 3వ తేదీన పోతవరం గ్రామానికి చెందిన గంటా రవి మరి కొందరితో కలిసి విజయ్ కుమార్ పొలంలోకి అక్రమంగా ప్రవేశించి మొక్కజొన్న పంటను ట్రాక్టర్లతో ధ్వంసం చేశారన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

డిపో జనరల్ బాడీ సమావేశం

జంగారెడ్డిగూడెం: డిపో జనరల్ బాడీ సమావేశం గురువారం నిర్వహించారు. స్థానిక తల్లాడి సత్తిపండు పంక్షన్ హాల్‌లో నిర్వహించిన సమావేశంలో నేషనల్ మజ్దూర్ యూనియన్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆలపాటి సూర్యచంద్రరావు తదతరులు పాల్గొని డిపో సమస్యలపై చర్చించారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టాల్సిన కార్యక్రమాలను మాట్లాడారు. కార్యక్రమంలో జోనల్ కార్యదర్శి అడపా రామారావు, జిల్లా అధ్యక్షుడు జి.రామారావు, ఏలూరు జిల్లా కార్యదర్శి బి.శ్రీనివాసరావు, పశ్చిమ, తూర్పుగోదావరి జిల్లాల కార్యదర్శులు వైవీ రావు, ఎస్‌డీ ముఖర్జీ, సుమారు 100 మంది డిపో ఉద్యోగులు పాల్గొన్నారు.

సబ్ డీఎఫ్‌ఓపై చర్యలు తీసుకోవాలి

బుట్టాయగూడెం: మండలంలోని గుళ్లపూడికి చెందిన మడకం యాకోబును బూటు కాళ్లతో తన్ని చిత్రహింసలు పెట్టిన సబ్ డీఎఫ్ఓ వెంకట సుబ్బయ్యపై చర్యలు తీసుకోవాలని ఆదివాసీ ఐక్య కార్యాచరణ కమిటీ చైర్మన్ మొడియం శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. సంఘటనకు సంబంధించిన వివరాలను యాకోబు భార్య అనితను అడిగి తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు తెల్లం లక్ష్మణరావు, రవ్వా బసవరాజు, ధర్మల వెంకటేశ్వరరావు, కొండరెడ్ల సంఘం నాయకులు పట్ల రమేష్‌కుమార్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మెటీరియల్ అందజేత

లింగపాలెం శింగగూడెం హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ప్యాడ్‌లు, మెటీరియల్‌ను గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు అందజేశారు. ఈ మేరకు గురువారం శింగగూడెం గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు కోటగిరి హరీష్, కోటగిరి ధీరాజ్‌కృష్ణ చేతుల మీదుగా త్వరలో పదోతరగతి పరీక్షలు రాస్తున్న 80 మంది విద్యార్థులకు ప్యాడ్‌లు, స్టడీమెటీరియల్, పెన్నులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీధర్, బి.శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు శావా రాజేష్, కొప్పుల వెంకటేశ్వరరావు, పామర్తి సుబ్బారావు, గ్రామ పెద్దలు, నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్షా సామగ్రి అందజేత

పోలవరం రూరల్: విద్య, వైద్యం పట్ల మానవత స్వచ్ఛంద సేవా సంస్థ చేస్తున్న సేవలు అభినందనీయమని గూటాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాఘవన్ అన్నారు. పాఠశాలలో గురువారం కెరీర్ గైడెన్స్ కార్యక్రమాన్ని మానవత ఆధ్వర్యంలో నిర్వహించారు. విద్యార్థులకు పరీక్షల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సలహాలు, సూచనలు చేశారు. విద్యార్థులకు ఆంగ్ల పుస్తకాలు, పెన్నులు, ప్యాడ్‌లు అందజేశారు. కార్యక్రమంలో సురేష్, పోసిబాబు, హనుమంతరావు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు ప్యాడ్‌లు, మెటీరియల్ అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

రోడ్డు నిర్మాణంలో నాణ్యత పాటించాలి

కొయ్యలగూడెం: పరింపూడి కన్నాయిగూడెం గ్రామాల మధ్య నిర్మిస్తున్న గ్రావెల్ రోడ్డు వివాదాస్పదంగా మారింది. దీనికి సంబంధించి అధికారులు, రైతులు చేస్తున్న ప్రకటనలు పొంతన లేని విధంగా ఉన్నాయి. వివరాల్లోకి వెళితే ఎన్ఆర్ఈజీఎస్ నిధుల ద్వారా రూ.70 లక్షలతో పరింపూడి నుంచి కన్నాయిగూడెం వరకు నాలుగు కిలోమీటర్ల మేర గ్రావెల్ రోడ్డు నిర్మిస్తున్నారు. సుమారు ఇరవై రోజుల క్రితం పనులను ప్రారంభించారు. అయితే రైతులు నాణ్యత లేని గ్రావెల్‌తో రోడ్డు నిర్మిస్తున్నారని ఆరోపణలు చేస్తున్నారు. రెండు వారాల క్రితం కన్నాయిగూడెంకి చెందిన రైతులు శుద్ధ మట్టిని గ్రావెల్ రోడ్డు నిర్మాణంలో వాడుతున్నారంటూ ఆందోళన చేసి పనులను అడ్డుకున్నారు. దాదాపు మూడు కిలోమీటర్ల వరకు రోడ్డును నిర్మించారు. మరో కిలోమీటర్ రోడ్డు నిర్మాణం ఆగిపోయింది. దీంతో అధికారులు, కూటమి నాయకులు తమతో చర్చించి, రోడ్డు నిర్మాణంలో నాణ్యత పాటిస్తామని చెప్పి ఇప్పటి వరకు పనులు ప్రారంభించలేదని రైతులు వాపోతున్నారు. ఈ రహదారి నిర్మాణంతో కొయ్యలగూడెం మండలంతో పాటు గోపాలపురం, దేవరపల్లి మండలాలకు చెందిన రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందన్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకుని రోడ్డు నిర్మాణంలో నాణ్యత పాటించాలని రైతులు కోరుతున్నారు.

నిర్మాణంలో ఉందంటున్న అధికారులు

పరింపూడి, కన్నాయిగూడెం గ్రావెల్ రోడ్డు పనులు నిర్మాణ దశలోనే ఉన్నాయని, రైతులతో చర్చించి పనులు పునఃప్రారంభించినట్లు పీఆర్ ఏఈ సురేష్ పేర్కొన్నారు. కానీ రైతులు మాత్రం తాము రోడ్డు పనులు అడ్డుకున్నామని పేర్కొనడం గమనార్హం.



సుద్దమట్టితో నిర్మిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్న రహదారి

నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలి

బుట్టాయగూడెం: మండలంలోని రామన్నగూడెం సమీపంలోని పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల పునరావాస కాలనీలో సమస్యలను పరిష్కరించాలని సర్పంచ్ అందెల రామిరెడ్డి, గ్రామపెద్ద వేట్ల ముత్యాలరెడ్డి కోరారు. గురువారం ఆ కాలనీలో నిర్వాసితులు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రామన్నగూడెం సమీపంలో నిర్మించిన ఆర్‌అండ్‌ఆర్ కాలనీ నిర్వాసితులకు అనేక సమస్యలు ఉన్నాయన్నారు. ముఖ్యంగా ప్రతి నెలా ప్రభుత్వం అందించే రేషన్ బియ్యం కోసం అనేక ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. తాము ఏటపాక మండలం నుంచి బుట్టాయగూడెం మండలం రామన్నగూడెం సమీపంలో నిర్మించిన నిర్వాసిత గ్రామానికి వచ్చి రెండేళ్లు గడుస్తున్నా రేషన్‌కార్డులు మాత్రం ఇక్కడికి బదిలీ చేయలేదన్నారు. దీంతో నెల నెలా మా సొంత మండలానికి వెళ్లి రేషన్ తెచ్చుకోవడానికి అనేక ఇబ్బందులు పడుతున్నామని మా రేషన్‌కార్డులను వెంటనే ఇక్కడికి బదిలీ చేయాలని కోరారు. అదే విధంగా కాలనీలో ఇప్పటి వరకూ నీటిని విడుదల చేయడానికి ఒక వ్యక్తి ఉండేవాడని అతను మార్చి 1వ తేదీ నుంచి రావడం లేదని తెలిపారు. తమ సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని కోరారు.



ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో సమావేశమైన నిర్వాసితులు

రైతులకు విశిష్ట సంఖ్య తప్పనిసరి

చింతలపూడి: రైతులు తప్పనిసరిగా విశిష్ట సంఖ్యను నమోదు చేయించుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి హబీబ్ భాషా సూచించారు. మండలంలోని ప్రగడవరం గ్రామంలో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన హబీబ్ భాషా మాట్లాడుతూ ఇప్పటి వరకు సబ్ డివిజన్‌లో 11,050 మంది రైతులు విశిష్ట సంఖ్యను నమోదు చేయించుకున్నారని తెలిపారు. ఇంకా 2,500 మంది రైతులు నమోదు చేయించుకోవలసి ఉందని చెప్పారు. రైతులకు భూసార పరీక్ష పత్రాలను అందజేశారు. ఏడీఏ బి.నాగకుమార్, మండల వ్యవసాయ అధికారి కె.మీనాకుమారి, ప్రగడవరం ఎంపీఈవో, రైతులు పాల్గొన్నారు.

విశిష్ట సంఖ్యను నమోదు చేసుకోవాలి

బుట్టాయగూడెం: మండలంలోని రెడ్డిగణపవరం సచివాలయం వద్ద గురువారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఏఓ డి.ముత్యాలరావు మాట్లాడుతూ వ్యవసాయ శాఖ ద్వారా రైతు విశిష్ట సంఖ్య నమోదు కార్యక్రమం మండలంలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మండలంలో ఇప్పటివరకూ ఆరు వేల మంది రైతుల వివరాలు నమోదు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా వ్యవసాయ అధికారి హబీబ్ భాషా

వాటర్ కూలర్ అందజేత

జంగారెడ్డిగూడెం: స్థానిక బాలాజీ నగర్ ఎంపీపీ పాఠశాలకు డాంగేనగర్ అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో డ్రింకింగ్ వాటర్ కూలర్ సభ్యులు అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి. కౌసల్య మాట్లాడుతూ గురువారం డాంగేనగర్ అంబేడ్కర్ యువజన సంఘం సభ్యులు దాతల సహకారంతో ఏర్పాటు చేసిన డ్రింకింగ్ వాటర్ కూలర్‌ను పాఠశాలకు అందించారన్నారు. ఈ సందర్భంగా సంఘ, వ్యవస్థాపకులు అమృతల రంగా, గౌరవ అధ్యక్షుడు నేలపోలు ప్రభాకర్‌రావు మాట్లాడుతూ బాలాజీ నగర్ పాఠశాలలో విద్యార్థుల అవసరాలకు తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో డాంగే నగర్ అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు కె.లక్ష్మణరావు, ఉపాధ్యక్షుడు ఎల్.శ్రీనివాస్, సభ్యులు విజయ్, ఉపాధ్యాయ సిబ్బంది పి.శిరీష, జి.శిరిషాదేవి, తల్లిదండ్రులు కమిటీ చైర్మన్ మంగయ్య విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



పాఠశాలకు వాటర్ కూలర్‌ను అందజేస్తున్న దాతలు

కార్యదర్శులకు పని భారం తగ్గించాలి

చింతలపూడి: గ్రామ పంచాయతీ కార్యదర్శులకు పని భారం తగ్గించాలని కోరుతూ మండల కార్యదర్శుల అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం ఎంపీడీవో మురళీకృష్ణకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్.కుమారస్వామి మాట్లాడుతూ ప్రస్తుతం 13 రకాల సర్వేలు చేస్తున్నట్టు తెలిపారు. సర్వేలతో పాటు ఇంటి పన్నులు, నీటి పన్నులు వసూలు చేయడంలో ఉక్కిరి బిక్కిరి అవుతున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మరో 26 రకాలు సర్వేల చేయాలని కార్యదర్శులపై ఒత్తిడి పెరిగిపోతుందన్నారు. పని భారంతో ఇబ్బంది పడుతున్న తమపై ప్రభుత్వం సర్వేల భారాన్ని తగ్గించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వాణి, వసంత ప్రసాద్, కార్యదర్శులు పాల్గొన్నారు.



ఎంపీడీవో మురళీకృష్ణకు వినతి పత్రం అందజేస్తున్న అసోసియేషన్ నాయకులు

కాలినడకన భద్రాచలానికి భక్తులు

కుక్కునూరు: మండలంలోని కొర్లకుంట, అశ్వారావుపేట మండలం నందిపాడు గ్రామాలకు చెందిన రామ భక్తులు గురువారం కాలినడకన భద్రాచలం బయలుదేరి వెళ్లారు. ప్రతి ఏడాది సీతారాముల కల్యాణానికి మండలం నుంచే కాకుండా పలు ప్రాంతాల నుంచి రామ భక్తులు కాలినడకన వెళుతుంటారు. కాగా ఎండల దృష్ట్యా, కల్యాణ సమయంలో భక్తుల రద్దీ అధికంగా ఉంటుండడంతో ఈ ఏడాది ముందుగానే కాలినడకన బయలుదేరి పౌర్ణమి రోజున రాముల వారిని దర్శించుకునేందుకు వెళుతున్నట్లు భక్తులు తెలిపారు.

అట్టహాసంగా వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం

ద్వారకాతిరుమల: మండలంలోని పలు గ్రామాల్లో వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవం బుధవారం అర్ధరాత్రి వరకు నిర్వహించారు. వెంకటకృష్ణాపురం గ్రామంలో ఈ వేడుకలను పార్టీ నేతలు అట్టహాసంగా చేపట్టారు. ముందుగా దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం కేక్‌ను కట్ చేసి ఒకరికొకరు తినిపించుకున్నారు. జై జగన్ నినాదాలతో ఆ ప్రాంతం మారుమ్రోగింది. ఈ వేడుకల్లో వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షులు గంటా విఘ్నేశ్వరరావు, వైస్ ఎంపీపీ యలమర్తి దుర్గాదేవి, గ్రామ సర్పంచ్ కామిరెడ్డి శ్రీను, యలమర్తి భాస్కరరావు, యూత్ లీడర్ టి.రాము తదితరులు పాల్గొన్నారు.



వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహిస్తున్న నేతలు

నాటు సారా విక్రయిస్తే కఠిన చర్యలు

చింతలపూడి: నాటుసారా తయారు చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీలత హెచ్చరించారు. గురువారం నాటు సారా వలన కలిగే అనర్థాలపై గ్రామస్తులకు అవగాహనా సదస్సు నిర్వహించారు. మాదక ద్రవ్యాల నేరాలకు పాల్పడే వారి వివరాలు టోల్ ఫ్రీ నంబర్ 14405కు గాని, ఎక్సైజ్ స్టేషన్ చింతలపూడి సెల్ నంబర్ 9440902428 గాని సమాచారం అందించాలన్నారు. ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ ప్రభుకుమార్, డీపీఈవో ఎ.ఆవులయ్య, జి.పాండురంగారావు, అజయ్‌కుమార్ సింగ్, ఎంపీపీ డాక్టర్ బి.రాంబాబు నాయక్, ఎంపీడీఓ మురళీకృష్ణ, ఎక్సైజ్ సీఐ పి.అశోక్, ఆర్.సత్యవతి, ఎస్సైలు పాల్గొన్నారు.



కార్యక్రమంలో నాటుసారాపై అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ అధికారులు

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

టి.నరసాపురం: పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా వ్యాధులకు దూరంగా ఉండొచ్చని పీహెచ్‌సీ వైద్యులు ఆర్.ఫణీంద్రబాబు అన్నారు. టి.నరసాపురం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో జాతీయ ఫైలేరియా (బోదకాలు) నివారణ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా టి.నరసాపురం పరిధిలోని నాలుగు సచివాలయాల్లో గుర్తించిన ఐదుగురు ఫైలేరియా బాధితులకు వాటర్ టబ్, మగ్, టవల్, సబ్బు, ఆయింట్‌మెంట్లు అందజేశారు. కార్యక్రమంలో చింతలపూడి సబ్‌యూనిట్ అధికారి ప్రసాద్, హెల్త్ సూపర్‌వైజర్‌లు పి.మావుళ్లమ్మ, ఎంపీఏఎస్ బేగ్, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.